క్లుప్తంగా

నిరుపేదలకు అన్నదానం



పేదలకు అన్నదానం చేస్తున్న కమిటీ సభ్యులు, ఎస్‌ఐ తారకేశ్వర్రావు

గొలుగొండ: ఏఎల్‌పురంలో ఫుడ్ ఫర్ పూర్ పీపుల్ ట్రస్టు, కృష్ణదేవిపేట ఎస్‌ఐ తారకేశ్వర్రావు ఆధ్వర్యంలో నిరుపేదలు, వికలాంగులు, వృద్ధులకు శుక్రవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పుల్వామా దాడిలో మరణించిన భారత్ జవాన్లకు ఆత్మశాంతి కలగాలని, అలాగే వారి కటుంబాలకు ప్రతి ఒక్కరూ అండగా ఉండాలని ట్రస్టు సభ్యులు తెలిపారు. ఫుడ్ ఫర్ పూర్ పీపుల్ ట్రస్టు సభ్యులు ఇటువంటి సేవా కార్యాక్రమాలు చేయడం ఆనందంగా ఉందని, దీని వల్ల ప్రతి ఒక్కరిలో దేశభక్తి పెరుగుతుందని ఎస్‌ఐ తారకేశ్వర్రావు అన్నారు.

పనుల్లో నాణ్యత తప్పనిసరి



రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీ సీఈవో రాజ్‌కుమార్

గొలుగొండ: ప్రభుత్వ నిధుల ద్వారా జరుగుతున్న పనులు నాణ్యంగా ఉండాలని, వేగంగా జరగాలని జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో రాజ్ కుమార్ తెలిపారు. ఆయన గొలుగొండ ఎంపీడీవో కార్యాలయాన్ని శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మేరీ రోజ్‌తో మాట్లాడుతూ జిల్లా పరిషత్ 15వ ఆర్థిక సంఘం నిధుల నుండి ఎంత మేర నిధులు మంజూరు అయ్యాయి, ఎంత ఖర్చు జరిగిందని అడిగి తెలుసుకున్నారు. అలాగే ఆయన స్థానిక గురుకుల కళాశాలలో విద్యార్థులకు తాగునీరు అందించి ప్లాంట్ మరమ్మతులకు గురి కావడాన్ని పరిశీలించారు. వర్షాలు కురిస్తే వర్షం నీరు నిల్వ ఉండిపోవడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నట్లు ప్రిన్సిపాల్ కోటేశ్వర్రావు డిప్యూటీ సీఈవో దృష్టికి తీసుకెళ్లగా ఆ పనులు పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

సంఘం అభివృద్ధే లక్ష్యం



మాట్లాడుతునన సిద్ది వినాయక సంఘం అధ్యక్షుడు మాకిరెడ్డి శ్రీను

రోలుగుంట: సంఘం అభివృద్ధే లక్ష్యమని స్థానిక శ్రీ సిద్ది వినాయక సంఘం అధ్యక్షుడు మాకిరెడ్డి శ్రీను అన్నారు. స్థానిక జీవకారుణ్య సంఘం భవనంలో శుక్రవారం రాత్రి సంఘం అభివృద్ధిపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘాన్ని ఎలా అభివృద్ధి చేయాలో సభ్యుల సలహాలు, సూచనలు తీసుకున్నారు. దీనిలో భాగంగా సంఘం ఆధ్వర్యంలో ధనుర్మాసంలో నిర్వహించిన మేలుకొలుపు కార్యక్రమంలో భక్తుల నుంచి ధన, దాన్య రూపేణా వచ్చిన విరాళాలు, ఖర్చు గురించి చదివి వినిపించారు. ఈ ఆదాయంతో ప్రతి ఏడాది మాదిరిగానే ఈ నెల 24న ఆలయం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించాలని సభ్యులు తీర్మానించారు.

చురుగ్గా నాచు, మొక్కల తొలగింపు

కె.కోటపాడు: మండలంలో మెట్ట ప్రాంత గ్రామాల గుండా రైవాడ కెనాల్ మార్గంలో నాచు, మొక్కల తొలగింపు కార్యక్రమాన్ని జీవీఎంసీకి చెందిన లాష్కర్లు నిర్వహిస్తున్నారు. ఈ పనులను శుక్రవారం గవరపాలెం-డి.అగ్రహారం గ్రామాల మధ్య గల కెనాల్ మార్గంలో చేపట్టారు. కెనాల్ మార్గంలో నాచు, మొక్కలు పెద్ద ఎత్తున పేరుకుపోవడం వల్ల జలాశయం నుండి విశాఖపట్నానికి ప్రవహించే నీటి ప్రవాహంలో అంతరాయం ఏర్పడుతోంది. ఈ కారణంగా జీవీఎంసీ అధికారులు నాచు, మొక్కల తొలగింపు పనులు చేపట్టారు. తద్వారా కెనాల్ మార్గంలో నీటి ప్రవాహ వేగం పెరుగుతుందని చెబుతున్నారు.

శతశాతం పనులు పూర్తి కావాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో హేమసుందర్

చీడికాడ: ఈ ఏడాది గ్రామాల్లో ఎన్ఆర్ఈజీఎస్ పనులు శత శాతం పూర్తి కావాలని ఎంపీడీవో హేమసుందర్‌రావు అన్నారు. శుక్రవారం పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌పీలతో సమావేశం నిర్వహించారు. వీఆర్‌పీలు పంచాయతీ కార్యలయాల్లో రికార్డులుంచి, రోజూ కనీసం గంట పాటు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. రానున్న వేసవి దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ బండారు శ్రీనివాసరావు, ఈవోపీఆర్‌డీ కామేశ్వరరావు, ఏపీవో గంగునాయుడు, ఈసీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రహదారి ఛిద్రం.. ప్రయాణం నరకం

- కె.జె.పురం జంక్షన్‌లో పొంగి పొర్లుతున్న మురుగు నీరు
- రోడ్లు శిథిలమై పాదచారులు.. వాహన చోదకుల ఇబ్బందులు
- డ్రైనేజీలు నిర్మించాలని స్థానికుల వినతి



కె.జె.పురం జంక్షన్‌లో రహదారిపై పారుతున్న ఇళ్లలోని వాడుక నీరు

మాడుగుల రూరల్: ఇళ్లలో వాడుతున్న వాడుక నీటిని రహదారి మీదకు మళ్లించడంతో రోడ్డు శిథిలావస్థకు చేరి వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వడ్డాది నుంచి పాడేరు ఆర్ అండ్ బీ రహదారిలో కె.జె.పురం జంక్షన్ వద్ద, ఆ పరిసరాల్లో నివసిస్తున్న వారు వాడుతున్న మురుగు నీరు డ్రైనేజీలు లేక రహదారి మీదకు మళ్లించడంతో సుమారు ఫర్లాంగు దూరం వరకు రోడ్డు పూర్తిగా శిథిలావస్థకు చేరి వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. స్థానిక సంతోషిమాత అన్నదాన సత్రం ఎదుట రహదారిపై గత కొన్నాళ్లుగా నీరు చేరి ఉండడంతో ఆ దారి గుండా ప్రయాణించే పాదచారులు, ద్విచక్ర వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో పాటు గతంలో ఈ ప్రదేశంలో రోడ్డు ప్రమాదంలో ఒక మహిళ మృతి చెందారు. ఈ మురుగు నీటి సమస్య గురించి జంక్షన్‌లో నివసిస్తున్న ప్రజలు పంచాయతీ అధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లారు. సరైన స్పందన లేక వారంతా మిన్నకున్నారు. ఇక్కడ డ్రైనేజీలు లేకపోవడం వల్ల ఈ సమస్య ఉత్పన్నమైంది. గతంలో గోతులు పడిన ప్రదేశంలో స్థానిక సంతోషిమాత ఆలయ కమిటీ చైర్మన్ కాళ్ల అమ్మతల్లినాయుడు స్థానికుల సహకారంతో తాత్కాలికంగా గోతులు పూడ్పించారు. అయితే తర్వాత మురుగు నీరు ప్రవహించడంతో మళ్లీ రహదారి శిథిలమై యథావిధిగా గోతులు ఏర్పడ్డాయి. తర్వాత ఆర్ అండ్ బీ అధికారులు మరమ్మతులు చేపట్టారు. షరా మామూలే అన్నట్లు రహదారి శిథిలమై గోతులు పడ్డాయి. ప్రస్తుతం వడ్డాది నుంచి తాటిపర్తి వరకు రోడ్డు విస్తరణ, రహదారి నిర్మాణ పనులు చేపట్టారు. ఈ పనులకు ముందుగానే మురుగునీరు పోవడానికి గాను డ్రైనేజీలు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. కాగా ఇళ్లలో నుంచి వస్తున్న మురుగు నీటి పరిష్కారానికి ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని అధికారులు జంక్షన్ సమీపంలో నివసిస్తున్న ప్రజలకు సూచించారు. కాగా జంక్షన్‌లో డ్రైనేజీలు నిర్మించాలని స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి దృష్టికి తీసుకెళ్లినట్లు ఎంపీటీసీ సభ్యుడు భీశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. డ్రైనేజీల నిర్మాణం చేపడితే ఈ సమస్యకు తెరపడుతుందని ఆయన అన్నారు.



శిథిల రహదారి పైనే వాహనాల ప్రయాణం

తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి..



కె.జె.పురం జంక్షన్‌లోని ఇళ్ల నుంచి వస్తున్న మురుగు నీరు పోవడానికి పూర్తి స్థాయిలో పక్కా డ్రైనేజీలు నిర్మించాలి. మురుగు నీటి వల్ల పాదచారుల నుంచి ద్విచక్ర వాహన చోదకుల వరకు అంతా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ రహదారి పూర్తిగా గోతులమయంగా మారింది. దీని వల్ల తరుచు ప్రమాదాలు జరుగుతున్నాయి. సమస్య పరిష్కారానికి పక్కా డ్రైనేజీలు నిర్మించాలి. అధికారులు స్పందించాలి.

– భీశెట్టి జగ్గప్పారావు, మార్కెట్ కమిటీ మాజీ సభ్యుడు, కె.జె.పురం గ్రామం

సమస్య పరిష్కరిస్తాం..



కె.జె.పురం జంక్షన్‌లోని రహదారి శిథిలమయింది. దీనికి కారణం ఆ జంక్షన్‌కు దగ్గరలో నివసిస్తున్న ఇళ్ల నుంచి వస్తున్న మురుగు నీరే. రహదారి మీదకు మురుగు నీరు చేరి రోడ్లు శిథిలం కావడం వల్ల పాదచారులు, వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. దీనికి డ్రైనేజీలు నిర్మించాలి. సమస్య పరిష్కారం కోసం ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి దృష్టికి తీసుకెళ్లాం. నిధులు మంజూరు చేస్తే డ్రైనేజీలు నిర్మిస్తాం.

– భీశెట్టి శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు, కె.జె.పురం గ్రామం

మెయిన్ రోడ్డులో ట్రాఫిక్ సమస్యలు



రద్దీగా ఉన్న మాడుగుల మెయిన్ రోడ్డు

మాడుగుల: నియోజకవర్గ కేంద్రం మాడుగుల గాంధీ పార్కు నుండి సబ్ రిజిస్టార్ కార్యాలయం వరకు వాహనాల రద్దీతో ట్రాఫిక్ ఇక్కట్లు తప్పడం లేదు. ఈ దారిలో ఎదురెదురుగా వచ్చే వాహనాలు తప్పుకోలేని పరిస్థితి. ఎంపీడీవో కార్యాలయం, మెజిస్ట్రేట్ కోర్టు, జూనియర్ కళాశాల, మండల ఎంఆర్‌సీ, పశు వైద్యశాల కార్యాలయాలకు చెందిన అధికారులు ఈ రోడ్డులోనే ప్రయాణించాలి. ప్రతి సోమవారం మాడుగులలో జరిగే వారపు సంతకు ఇతర ప్రాంతాల నుండి వచ్చే వాహనాలకు కూడా ఈ రోడ్డే మార్గం. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు వెడల్పు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

వ్యాపారి జాగాని మృతికి సంతాపం



జాగాని చంద్రరావు (ఫైల్)

మాడుగుల: ప్రముఖ వ్యాపారవేత్త జాగాని చంద్రరావు (76) గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం సాయంత్రం మృతి చెందారు. ఈయన స్థానిక సూపర్ బజార్ చైర్మన్‌గా, వాసవీ క్లబ్ చైర్మన్‌గా, చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యదర్శిగా అనేక పదవులు చేపట్టి, సేవలందించారు. ఈయన మృతికి మండలంలో గల వాసవీ క్లబ్ సభ్యులు, వర్తక సంఘం సభ్యులు, అఖిల పక్ష నాయకులు తదితరులు సంతాపం తెలిపారు.

వైభవంగా దుర్గాలమ్మ తల్లి పండగ

దేవరాపల్లి: మండలంలోని ముషిడిపల్లిలో గ్రామ దేవత దుర్గాలమ్మ అమ్మవారి ఒడ్డు పండగ శుక్రవారం వైభవంగా జరిగింది. ముందుగా గ్రామస్తులంతా పసుపు, కుంకుమలతో గ్రామ పుర వీధుల్లో కోలాటం, తప్పిటగుళ్లు తదితర సాంస్కృతిక కార్యక్రమాల నడుమ ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారికి భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో నిర్వహించిన భారీ అన్నసమారాధనలో భక్తులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు మహా ప్రసాదం స్వీకరించారు. దుర్గాలమ్మ అమ్మవారిని మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు దర్శించుకుని పూజలు చేశారు. ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు కర్రి సత్యం, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబూరావు, డాక్టర్ వరదపురెడ్డి సింహాచలం నాయుడు, పార్టీ ఆర్టీఐ విభాగం జిల్లా అధ్యక్షుడు కె.వి.రమణ, ముషిడిపల్లి సర్పంచ్ మతల దేముడమ్మ, ఎంపీటీసీ బొడ్డు లక్ష్మి, ఎ. కొత్తపల్లి, కె.ఎం.పాలెం సర్పంచ్‌లు చింతల సత్య వెంకట రమణ, గంధం రామకృష్ణ, వంటాకు శ్రీను తదితరులు పాల్గొన్నారు.



దుర్గాలమ్మ తల్లిని దర్శించుకుంటున్న బూడి ముత్యాలనాయుడు తదితరులు

నేడు అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట

కె.కోటపాడు: చౌడువాడ గ్రామంలో గల గవరపేటలో నూతనంగా నిర్మించిన అభయాంజనేయ స్వామి ఆలయ ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు శనివారం నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఆలయ ప్రాంగణంలో శుక్రవారం మండపారాధన పూజలు జరిపారు. వీటితో పాటు క్షీరాధివాసం, ఆవాహిత, హోమ కార్యక్రమాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. శనివారం శాస్త్రోక్తంగా ఆలయ ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు జరిపి భక్తులకు అభయాంజనేయస్వామి దర్శనం కల్పించనున్నట్లు అర్చకులు సాయిరాం శర్మ తెలిపారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేసినట్లు ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.



మండపారాధన పూజల్లో పాల్గొన్న భక్తులు

విద్యార్థినికి అభినందన

చోడవరం రూరల్: జాతీయ సమైక్యత శిబిరంలో పాల్గొని విజయ వంతంగా పూర్తి చేసుకుని వచ్చిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని సవరాల వెంకటలక్ష్మిని శుక్రవారం అభినందించారు. విద్యార్థిని వెంకటలక్ష్మి ఆంధ్రా యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ ప్రతినిధిగా హర్యానా రాష్ట్రంలోని చండీఘర్ సెంట్రల్ యూనివర్సిటీలో జరిగిన జాతీయ సమైక్యతా శిబిరంలో పాల్గొన్న సంగతి పాఠకులకు విదితమే. ఏపీ తరపున శిబిరంలో పాల్గొన్న ఎన్ఎస్ఎస్ వలంటీర్ల క్విజ్ పోటీలు, జానపద నృత్యం తదితర సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని పలు బహుమతులు సాధించారని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.కిరణ్‌కుమార్ ఈ సందర్భంగా తెలిపారు. ఇలాంటి శిబిరాల్లో పాల్గొనే అవకాశాన్ని విద్యార్థులకు కల్పిస్తున్న ఆంధ్రా యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఎస్.హరనాథ్, డీపీవో ఈ.భాగ్యలక్ష్మిలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. విద్యార్థినిని ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ ఐ.వి.వి.సత్యవతి, ఎన్ఎస్ఎస్ పీవోలు వి.రత్నభారతి, డి.మాల్యాద్రి, బి. పిచ్చమ్మ, ఉపన్యాసకులు మల్లిబాబు, జి.వెంకటేష్, కృష్ణారావు, నారాయణమూర్తి తదితరులు అభినందించారు.



విద్యార్థిని వెంకటలక్ష్మిని అభినందిస్తున్న అధ్యాపకులు తదితరులు

రైతు సమస్యలు తక్షణం పరిష్కరించాలి

గొలుగొండ: రైతుల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, గ్రామాల్లో రీ సర్వే పనులు వేగవంతం చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి వైఎస్‌వీకేజీఎస్‌ఎల్ సత్యనారాయణ తెలిపారు. ఆయన గొలుగొండ తహసీల్దార్ కార్యాలయాన్ని శుక్రవారం సందర్శించారు. ముందుగా గ్రామాల్లో ఇటీవల జరిగిన రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన ఫిర్యాదులు పరిశీలించి వాటిని పరిష్కరించాలన్నారు. తిరస్కరణ రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో రీసర్వే పనులు వేగవంతంగా జరగాలని, రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వచ్చిన ఫిర్యాదులు పూర్తి స్థాయిలో పరిశీలించి వాటిని పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న డీఆర్‌వో సత్యనారాయణ

కూలీ రేటు గిట్టుబాటు కాక ఇబ్బందులు

గొలుగొండ: స్థానిక కలప డిపోలో పనిచేస్తున్న టింబర్ కూలీలు గిట్టుబాటు ధర లేక ఇబ్బందులు పడుతున్నామని శుక్రవారం ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 35 సంవత్సరాల నుండి గొలుగొండ కలప డిపోలో పని చేస్తున్నట్లు చెప్పారు. తమ తండ్రుల తర్వాత తాము కూడా ఇదే కలప డిపోలో పని చేస్తున్నట్లు చెప్పారు. ఏజెన్సీ కలప డిపోలో సీఎంటీకి రూ.500 ఇవ్వగా ఇక్కడ రూ. 480 మాత్రమే ఇస్తున్నారని తెలిపారు. అలాగే ఏజెన్సీలో లోడింగ్‌కు అడుగుకు రూ. 20 ఇవ్వగా, ఇక్కడ రూ.17 ఇస్తున్నారని అన్నారు. దీని వల్ల తాము చాలా నష్టపోతున్నట్లు చెప్పారు. అటవీశాఖ అధికారులు చర్యలు చేపట్టి కూలీలకు గిట్టుబాటు ధర వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు



గొలుగొండ కలప డిపో వద్ద ఆవేదన వ్యక్తం చేస్తున్న టింబర్ కూలీలు

తాగునీటి బోరుకు మరమ్మతులు



తాగునీటి బోరుకు మరమ్మతు చేస్తున్న సిబ్బంది

గొలుగొండ: లింగంపేట గ్రామ పంచాయతీలో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటామని సర్పంచ్ తోకల సంతోష్ తెలిపారు. వేసవి కావడంతో గ్రామంలో తాగునీటి బోర్లు, కుళాయిలు, రక్షిత మంచి నీటి పథకాలు పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకొచ్చి ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా చేస్తామన్నారు. ఇప్పటికే 80 శాతం పథకాలు వినియోగంలో ఉండగా మరో రెండు రోజుల్లో మిగతా వాటికి మరమ్మతు చేస్తామని పంచాయతీ అధికారులు తెలిపారు.

ఘనంగా అడవిరాజులబాబు పండగ



అడవిరాజులబాబును దర్శించుకుంటున్న భక్తులు

నాతవరం: మండలంలో అడవి రాజులబాబు పండగను నాతవరం, మర్రిపాలెం, వెన్నలపాలెం, శృంగవరం, ఎంబీ పట్నం గ్రామాల్లో భక్తులు శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. అడవిరాజుబాబుల దర్శనం కోసం ఉదయం నుంచి అధిక సంఖ్యలో భక్తులు క్యూలో ఉండి మొక్కులు చెల్లించుకున్నారు. పండగ సందర్భంగా గ్రామాల్లో భక్తులు బాణసంచా కాల్చారు. అదే విధంగా శక్తి వేషాలు, మహిళలచే భజనలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఆలయాల వద్ద అన్నదానం నిర్వహించారు.

మున్సిపాలిటీలో అక్రమాలపై విచారణ జరపాలి



నాగేశ్వరరావు

నర్సీపట్నం: మున్సిపాలిటీలో జరుగుతున్న అక్రమాలపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని జైభీమ్ రావ్ భారత్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నేతల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మున్సిపాలిటీలో డ్రైవింగ్ రాని వారిని డ్రైవర్లుగా నియమించడంతో పని చేయకుండానే జీతాలు తీసుకుంటున్నారన్నారు. 13 మందికి అధికారులు డ్రైవర్లుగా జీతాలు చెల్లిస్తున్నారని, కాని వీరిలో ఇద్దరే డ్రైవర్లు అని తెలిపారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబు, అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మున్సిపాలిటీ అక్రమాలపై ప్రభుత్వానికి ఫిర్యాదు చేశామన్నారు.

బెల్టు షాపులు అరికట్టాలి

దేవరాపల్లి: గ్రామాల్లో మద్యం బెల్టు షాపులను అరికట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి. వెంకన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు దేవరాపల్లిలో శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. గ్రామాల్లో బెల్టు షాపులు పెట్టబోమని, పెడితే తాట తీసి పీడీ యాక్టు అమలు చేయాలంటూ స్వయాన ముఖ్యమంత్రి ప్రకటన చేసినా ఎక్కడా అమలు కావడం లేదన్నారు. జిల్లా వ్యాప్తంగా గ్రామాల్లో ప్రతీ టీ దుకాణం, పాన్‌షాపులు, దాబాల్లో విచ్చల విడిగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయన్నారు. తక్కువ ధరకు మద్యం విక్రయిస్తామని గొప్పలు చెప్పిన ప్రభుత్వం తాజాగా 15 శాతం ధరలు పెంచి రూ. 150 కోట్ల మేర మందుబాబుల నుంచి వసూలు చేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 20 ఫోక్సో కేసులు నమోదు కావడం ఇందుకు నిదర్శనమన్నారు. గత నెల 27న ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా తీరు మారలేదన్నారు. హోం మంత్రి సొంత జిల్లాలో మైనర్ బాలికలు, మహిళలపై అత్యాచారాలు జరుగుతున్నా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాల్లో మద్యం బెల్టు షాపులపై ఉక్కుపాదం మోపాలని డిమాండ్ చేశారు.

బర్డ్‌ఫ్లూ నేపథ్యంలో కోళ్ల ఫారాల పరిశీలన

మాడుగుల రూరల్: ఉభయ గోదావరి జిల్లాలో కోళ్లకు బర్డ్‌ఫ్లూ వైరస్ వ్యాపించడంతో మండలంలో గల కోళ్ల ఫారాలను ర్యాపిడ్ రెస్పాన్స్ బృందాలు పరిశీలిస్తున్నాయి. కె.జె.పురంలోని కోళ్ల ఫారాలను స్థానిక పశు వైద్యాధికారి ఎం. మణి లక్ష్మణ్ శుక్రవారం పరిశీలించారు. కోళ్ల ఫారం రైతులు బయో సెక్యూరిటీ చర్యలు తీసుకోవాలని, ఫారం షెడ్ల ప్రవేశ మార్గంలో పొటాషియం పర్మాంగనేట్ ద్రావణం ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ఫారం పరిసరాల్లో రెండు శాతం సోడియం హైపో క్లోరైడ్ లేదా బ్లీచింగ్ పౌడర్ లేదా సున్నం చల్లుకోవాలని, ఫారంలో పని చేసే సిబ్బంది వ్యక్తిగత శుభ్రత పాటించాలని, ఒక వేళ కోళ్లు చనిపోతే సంబంధింత పశు వైద్యాధికారులకు తెలియజేసి, పూడ్చిపెట్టాలన్నారు. ఇతర జీవభద్రత చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట స్థానిక పశు వైద్య సహాయకులు కొర్రా రమేష్ ఉన్నారు.



కె.జె.పురంలో కోళ్లఫారం యజమానితో మాట్లాడుతున్న పశు వైద్యాధికారి మణి లక్ష్మణ్

ఫార్మర్ రిజిస్ట్రేషన్ గడువు ఈనెల 25



లచ్చన్నపాలెంలో రిజిస్ట్రేషన్ చేస్తున్న వ్యవసాయ సిబ్బంది



రైతుల వివరాలు నమోదు చేసుకుంటున్న కొమరవోలు ఆర్బీకే వ్యవసాయాధికారి నవ్య

మాకవరపాలెం: ఈ నెల 25లోగా రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలని ఏవో చిరంజీవి తెలిపారు. ఆయన మండలంలోని వివిధ గ్రామాల్లో జరుగుతున్న రిజిస్ట్రేషన్ ప్రక్రియను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఉన్న అన్ని రైతు సేవా కేంద్రాల పరిధిలో ఇప్పటి వరకు 1150 మంది రైతుల పేర్లను రిజిస్ట్రేషన్ చేశామన్నారు. రైతులంతా తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, లేకుంటే వ్యవసాయానికి సంబంధించిన రాయితీలు అందే అవకాశం లేదన్నారు. ఈ నెల 25లోగా రైతులు స్థానికంగా ఉన్న రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ పూర్తి చేయించుకోవాలన్నారు.

జోరుగా రైతు వివరాల నమోదు..

రోలుగుంట: మండలంలో గల సచివాలయాల్లో రైతుల భూములకు సంబంధించి ప్రభుత్వం చేపట్టిన ఐడీ నమోదు కార్యక్రమం జోరందుకుంది. ఈ కార్యక్రమం మండలంలో గల అన్ని ఆర్బీకేల వద్ద చేపట్టారు. దీనిలో భాగంగా అందుకు అవసరమైన ఆధార్ కార్డు, లేదా పట్టాదారు పాస్ బుక్, ఆధార్‌తో లింక్ అయిన మొబైల్, బ్యాంకు అకౌంట్ జిరాక్సు కాపీలు ఆర్బీకేల వద్దకు తీసుకొచ్చి నమోదు చేసుకుంటున్నారు. కొమరవోలు ఆర్బీకే పరిధిలో సుమారు 500 మందికి పైబడి రైతులు ఉండగా , శుక్రవారం నాటికి 65 మంది రైతులు తమ వివరాలు నమోదు చేసుకున్నట్లు ఆర్బీకే వ్యవసాయ సహాయాధికారి నవ్య తెలిపారు. ఈ గడువు 25 వరకే ఉంటుందని, రైతులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎస్.విజయలక్ష్మి తెలిపారు.

పీసా కమిటీ సభ్యులకు శిక్షణ తరగతులు

నాతవరం: గిరిజనులకు అన్ని విధాలుగా మేలు చేసేందుకు పీసా చట్టం ఎంతో దోహదపడుతుందని ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నూతనంగా ఎన్నికైన పీసా కమిటీ సభ్యులకు శిక్షణ తరగతులు నిర్వహించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు నిబంధనల ప్రకారం అమలు చేయాలంటే పీసా కమిటీ సభ్యులకు కనీస అవగాహన ఉండాలన్నారు. శిక్షణ తరగతుల్లో చెప్పిన అంశాలను పీసా కమిటీ సభ్యులు క్షేత్రస్థాయిలో అమలు చేసేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేయాలన్నారు. అధికారులు నిబంధనలు పాటించకుండా మొక్కుబడి కార్యక్రమాలు చేస్తారని, వాటిని పీసా కమిటీ సభ్యులు ప్రశ్నించి అడ్డుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కె.ఉషశ్రీ, కార్యాలయ సూపరింటెండెంట్ పోలుపర్తి పార్థసారథి, పంచాయతీ విస్తరణాధికారి ఎస్.ఎస్.మూర్తి, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



శిక్షణలో భాగంగా మాట్లాడుతున్న ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి